'హైదరాబాద్‌లో మజ్లిస్ ఓటమి ఖాయం'



మంగళ్‌హాట్‌లో ప్రచారం చేస్తున్న మాధవీలత, శశికళ కృష్ణ

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఓడిపోవడం ఖాయమైందని బీజేపీ అభ్యర్థి మాధవీలత పేర్కొన్నారు. మైనార్టీలు అంతా మజ్లిస్‌పై వ్యతిరేకంగా ఉండి తమను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మంగళవారం మంగళ్‌హాట్, దత్తాత్రేయనగర్, మహాలక్ష్మీనగర్, శివలాల్‌నగర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో జీపు యాత్ర నిర్వహించి ప్రచారం చేశారు. అనంతరం మాధవీలత మాట్లాడుతూ.. మజ్లిస్ అభ్యర్థి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రతి ఎన్నికల్లో మైనార్టీలకు మాయమాటలు చెప్పి గెలుస్తున్నారన్నారు. తనను గెలిపిస్తే హైదరాబాద్ పార్లమెంట్‌లోని అన్నివర్గాల ప్రజలకు అండగా ఉండి వారికి నిరంతర ప్రజా సేవ చేస్తానన్నారు. కార్పొరేటర్ శశికళ కృష్ణ, గోషామహల్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.కృష్ణ, చంద్రమోహన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన

వ్యక్తికి ఐదేళ్ల జైలు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో పాఠశాల విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడికి న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో పదేళ్ల బాలిక ఇంటి ముందు సైకిల్ తొక్కుతున్న క్రమంలో సైదాబాద్‌కు చెందిన మహ్మద్ ముజీబ్ ఉర్ రహమాన్(21) అసభ్యంగా ప్రవర్తించి పరారయ్యాడు. పక్షం రోజుల అనంతరం అదే బాలిక పాఠశాలకు వెళ్తుండగా మరోసారి మార్గంలో కాపు గాసి ఉండడాన్ని చూసిన బాలిక కేకలు వేయడంతో స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయగా, కేసును విచారించిన హాకాభవన్ న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరిచారు.

సత్తాచాటిన 'పది' విద్యార్థులు



నిత్యప్రణవిణి (10/10) | శ్రద్ధ (10/10) | వాయిజేప్రతిక్ష (10.10) | సాత్విక్ (9.8) | పూజాగాంధీ (9.8) | తరుణ్ (9.8) | శ్రీశైల పవిత్ర(9.8)

సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పది ఫలితల్లో సత్తాచాటారు. వాయిజేప్రతిక్ష 10/10, పూజా శర్మ 9.8 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు. బాలుర ప్రాథమిక పాఠశాలలో తరుణ్ 9.8, ఆనంద్ 9.5 జీపీఏతో ఉత్తీర్ణత సాధించారు.

విజయనగర్‌కాలనీ: విజయనగర్ కాలనీ నారా యణ ఈ టెక్నో విద్యార్థులు పది ఫలి తాల్లో ప్రతి భ కనబరిచారు. విద్యార్థులు పి.గణేష్, కె.శ్రవణ్‌తేత (9.8), కె.రామ్‌తేజ, (9.7), మునీబ్, ఆండ్రీవ్, ఆషియాలు (9.5) సాధించారు.

ధూల్‌పేట్‌లో..

అబిడ్స్: విద్యారంగ అభివృద్ధికి రిలయన్స్ హైటెక్ స్కూల్ చేస్తున్న కృషి అమోఘమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. మంగళవారం పది ఫలితాల్లో ధూల్‌పేట్‌లోని రిలయన్స్ హైటెక్ స్కూల్ తమ సత్తాచాటారు. నలుగురు విద్యార్థులకు 10 జీపీఏ, మరో 30 మందికి 9.0 కంటే అధికంగా జీపీఏ రావడంతో పాఠశాలలో సంబరాలు చేశారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరై విద్యార్థులను అభినందించారు.

గోల్కొండలో..



ఆనంద్ (9.5) | అరింధమ్ మరపట్ల (9.2)

గోల్కొండ: తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ మంగళవారం సక్సెస్ ఎడ్యుకేషన్ అకాడమీ కరస్పాండెంట్ మహ్మద్ ఇర్ఫాన్, ప్రిన్సిపాల్ సమీనాను, ప్రతిభ కనబరిచిన మహ్మద్‌జైద్, మహ్మద్ ఇర్ఫాన్ అభినందించారు. గోల్కొండలోని ప్రభుత్వ ఉన్నత తెలుగు పాఠశాల విద్యార్థిని సాయేమా (9.8) జీపీఏ, అమీనా (9.0) జీపీఏ సాధించారు.

బండ్లగూడ మండలంలో 75 శాతం ఉత్తీర్ణత..

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల్లో 535 మంది పరీక్షలు రాయగా 75 శాతంతో 402 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డిప్యూటీ ఈఓ ఆదిత్య వర్ధన్ తెలిపారు. జీజీహెచ్‌ఎస్ ఫలక్‌నుమాలో 36 మంది విద్యార్థులకు 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. లలితాబాగ్ మల్లికార్జుననగర్‌కు చెందిన ఎం.సత్యనారాయణ, భార్గవిల తనయుడు ఎం.సాత్విక్ 9.8 జీపీఏ సాధించి అభినందనలు అందుకున్నాడు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, జితేందర్ సింగ్



గుడిమల్కాపూర్ నారాయణ స్కూల్ విద్యార్థులు



సమీనాబేగంకు బొకే అందజేస్తున్న మహ్మద్ జైద్



నారాయణ ఈ టెక్నో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జియాగూడలో..

జియాగూడ: జియాగూడ కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థిని వింజమూరి నిత్య ప్రణవిణి (10/10) సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ..అనీష్ (9.8 గ్రేడ్) సాధించినట్లు, అలాగే 18 మంది విద్యార్థులు 9 గ్రేడ్ కంటే ఎక్కువ సాధించారని తెలిపారు. జియాగూడ శాంతినగర్‌లోని శ్లోకా ది స్కూల్‌లో విద్యార్థిని కె.శ్రద్ధ (10/10 జీపీఏ) సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ నాగేశ్వర్ తెలిపారు. అలాగే ఎ.ప్రగతి (9.8), నిఖిత నిర్వాన్ కూడా (9.8), అలాగే 20 మందికి పైగా విద్యార్థులు 9 గ్రేడ్ కంటే ఎక్కువే సాధించారని తెలిపారు. జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్ టింగిరికార్ శ్రీనిధి (9.7), జి.పల్లవి (9.7 జీపీఏ) సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెరా, ప్రిన్సిపాల్ సునిత తెలిపారు.

100 శాతం ఉతీర్ణత..

యాకుత్‌పురా: అశ్రయ్ ఆకృతి స్వచ్ఛంద సంస్థ చెందిన బధిర పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉతీర్ణత సాధించారు. సంస్థలో 14 మంది మూగ, చెవిటి విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు 9 జీపీఏ సాధించగా..మిగత 12 మంది ఉత్తమ ఫలితాలు సాధించారని సంస్థ యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి సయ్యద్ ఇంతియాజ్ మోహదీ తెలిపారు.

'సెయింట్ మేరీస్' విద్యార్థుల ప్రతిభ

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి ఫలితాల్లో గుడిమల్కాపూర్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ భిక్షపతి ఓ ప్రకటనలో తెలిపారు. స్కూల్ టాపర్లుగా నిలిచిన శ్రీశైల పవిత్ర(9.8), అరిందమ్ మరపట్ల(9.2)కు ప్రిన్సిపాల్ భిక్షపతి, అడ్మిన్ ప్రిన్సిపాల్ సునీత, కరస్పాండెంట్ జ్యోతి, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

'అసదుద్దీన్ ఒవైసీ విజయాన్ని ఆపలేరు'



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో పాటు నాయకులు రాజేశ్వర్‌రావు

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని బహదూర్‌పురా నియోజకవర్గం మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ కోరారు. మంగళవారం దూద్‌బౌలీ తదితర ప్రాంతాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజేశ్వర్‌రావు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించి ఆయనతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.దూద్‌బౌలీ, జహనుమా కార్పొరేటర్లు, స్థానిక మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు ఎంపికైన వారికి వ్యాక్సినేషన్

గోల్కొండ: ఈ సంవత్సరం హజ్ యాత్రకు ఎంపికైన వారికి తమ ఆసుపత్రిలో మొదటి రోజు వ్యాక్సినేషన్ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా అన్నారు. మంగళవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటైన వ్యాక్సిన్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మొదటి రోజు మొత్తం 130 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సిన్‌లు వేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సంవత్సరం హజ్ యాత్రికుల కోసం మొదటిసారిగా తమ ఆసుపత్రి ఎంపికైందని ఆయన పేర్కొన్నారు. వ్యాక్సిన్ వేసే వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వలంటీర్లు సహాయ పడ్డారు.

అభివృద్ధికే ఓటు వేయండి: ఎమ్మెల్యే కౌసర్

లంగర్‌హౌస్: ఎన్నికల వేళ వచ్చి మాయమాటలు చెప్పేవారిని నమ్మకుండా అభివృద్ధికే ఓటు వేయాలని ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన పాదయాత్ర చేస్తూ లంగర్‌హౌస్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా మార్కెట్ రోడ్డులోని పురాతన మసీదు వద్ద పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాలుగా తాము ప్రతి వీధిలో చేసిన అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఎంఐఎంను గెలిపించి మన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ పాదయాత్రలో నాయకులు రేణుక, శివశంకర్, సునంద, శారద పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీ

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాలకు చెందిన ఓటర్లకు వారి ఓటరు స్లిప్పులను అందజేస్తున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్, నియోజకవర్గం ఏఆర్‌ఓ సరిత తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలోని సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో ఈ ఓటరు స్లిప్‌లను ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నారన్నారు. ఓటరు స్లిప్‌లు అందకపోతే తమను సంప్రదించాలని ఆమె కోరారు.

తెలంగాణ యాస, కళలను కాపాడుకుందాం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ యాస, కళలను కాపాడుకునేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ..వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి పురస్కారాలను ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. సినీనటి రోజరమణి, సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ నిర్వాహకురాలు బిందులీమా పాల్గొన్నారు.